AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

'సెంట్రల్' వెలుగులెప్పుడో..!







చాకలి ఐలమ్మకు నివాళులు



## సీపీ సెట్‌లో గిరిరాజ్ విద్యార్థుల ప్రతిభ

**అక్షరటుడే, ఇందూరు:** టీజీ సీపీ సెట్ లో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో మునిగంటి కీర్తన రాష్ట్ర ప్రథమ ర్యాంకును సాధించినట్లు పేర్కొన్నారు. గణితంలో దుర్గాప్రసాద్ 2వ ర్యాంకు, అఖిల్ తేజ 5వ ర్యాంకు, వైష్ణవి 7వ ర్యాంకు, పోతుల వైష్ణవి 24 ర్యాంకు, స్ఫూర్తి 35వ ర్యాంకు, సాధించినట్లు తెలిపారు. అలాగే కంప్యూటర్ సైన్స్‌లో సుప్రియ 66 ర్యాంకు, బయోటెక్నాలజీలో మొహమ్మద్ హసీనా 128వ ర్యాంకు, హిందీలో అఖిల 78, ఇంగ్లిష్‌లో గంగోత్రి 20వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. జువాలజీలో ఫర్యల్ తబ 18వ ర్యాంకు, జియా కౌసర్ 96 వరకు సాధించారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రంగరత్నం, అధ్యాపకులు అభినందించారు.



## ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరాంసాగర్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు 8 వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతే మొత్తంలో ఔట్ ఫ్లో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంటుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు (1091 అడుగులు ) కాగా ప్రస్తుతం అంతేమొత్తం నీటితో నిండుకుండలా ఉంది. శ్రీరామ్‌సాగర్ నుంచి 8 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. వరద కాలువ కు 19 వేలు, కాకతీయ కాలువ కు 5,500, సరస్వతి కాలువకు 800, లక్ష్మి కాలువ ద్వారా 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలీసాగర్‌కు 360 క్యూసెక్యులు, గుత్పకు 270, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతుండగా, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతుంది.



## వందరోజుల కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

**అక్షరటుడే, ఇందూరు:** మున్సిపల్ శాఖ చేపట్టిన వందరోజుల కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులోనూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో బుధవారం 100 రోజుల కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామన్నారు. నగరంలోని అన్ని డివిజన్‌లో శానిటేషన్ వర్క్, ప్యాచ్‌వర్క్‌లు, ఫాగింగ్ చేపట్టామన్నారు. సిబ్బంది బాధ్యతతో వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ సాగర్, డిప్యూటీ కమిషనర్ రవిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



## విధుల్లో చేరిన జీపీవోలు

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఇటీవల గ్రామ పరిపాలన అధికారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీవోలకు పోస్టింగులు ఇచ్చారు. ఈ మేరకు మోపాల్ మండలంలో 11 మంది జీపీవోలు రిపోర్ట్ చేశారని డిప్యూటీ తహశీల్దార్ సరిత పేర్కొన్నారు. మోపాల్, ఠాణాకుర్తి గ్రామానికి జీపీవో గంగాభవాని, సిర్పూర్ గ్రామానికి చెందిన రవి, బోర్గాం(పి) గ్రామానికి వేణుగోపాల్ తదితరులు ఛార్జి తీసుకున్నారని ఆమె పేర్కొన్నారు.

బోధన్‌లో ఉగ్రవాద లింకులు బయట పడటం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. పట్టణానికి చెందిన ఓ యువకుడికి ఐసిస్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలు చేపట్టాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ యువకుడిని కోర్టులో ప్రవేశపెట్టి కస్టడీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

–అక్షరటుడే, బోధన్



# ఉగ్ర లింకుల కలకలం

బోధన్‌లో కేంద్ర దర్యాప్తు సంస్థల సోదాలు

యువకుడిని అదుపులోకి తీసుకున్న అధికారులు

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఉగ్రవాద లింకులు కలకలం సృష్టించాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు బోధన్ పట్టణంలో బుధవారం తెల్లవారు జామున విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. కాగా.. ఐసిస్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం బోధన్ కోర్టులో ప్రవేశపెట్టి కస్టడీకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా.. ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా కేంద్ర నిఘా సంస్థలు, ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఐసిస్‌తో సంబంధాలు కలిగి ఉన్న వారిపై నిఘా ఉంచాయి. ఈ క్రమంలో అఫర్ డానిష్‌ను జార్ఖండ్‌లోని రాంచీలో అరెస్ట్ చేశాయి. అనంతరం అతడు ఇచ్చిన సమాచారం మేరకు దేశ వ్యాప్తంగా తనిఖీలు చేపట్టాయి. ఢిల్లీలో మరో ఉగ్రవాదిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని బోధన్ పట్టణంలో కూడా దర్యాప్తు సంస్థకు చెందిన బృందాలు జల్లెడ పట్టాయి. పక్కా సమాచారం మేరకు ఉగ్ర మూలాలు కలిగిన వ్యక్తిని అరెస్టు చేశాయి. అతని వద్ద ఐసిస్ కార్యకలాపాలకు సంబంధించిన కీలక సమాచారం రాబట్టడంతో పాటు ఓ ఎయిర్ పిస్టల్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయమై స్థానిక పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు కేంద్ర దర్యాప్తు సంస్థలు సైతం అధికారికంగా విషయాలు వెల్లడించలేదు. గతంలోనూ బోధన్ పట్టణంలో ఉగ్రలింకులకు సంబంధించి ఎన్ఐఏ సహా పలు కేంద్ర దర్యాప్తు సంస్థలు సోదాలు చేపట్టాయి. ఉగ్ర లింకులు కలిగిన వారిపై ఆరా తీశాయి. ప్రత్యేక్షించి బంగ్లాదేశీయులు, రోహింగ్యాలకు ఇక్కడి నుంచే పాస్‌పోర్టులు జారీ అయిన ఉదంతం కూడా అప్పట్లో చర్చకు దారి తీసింది. తాజాగా ఐసిస్‌తో సంబంధాలున్న వ్యక్తి పట్టుబడడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.



## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని దేవునిపల్లి పాఠశాలలో బుధవారం సాయంత్రం సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎల్లయ్య మాట్లాడుతూ.. గురువు స్థానం అనేది ఉత్తమమైనదన్నారు. పిల్లలకు మంచి విద్య బోధన అందించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యోగ సంఘాలకు శాశ్వత సభ్యత్వంపై హర్షం



**అక్షరటుడే, ఇందూరు:** గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలన్నింటిని తెలంగాణ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జేఏసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్ మాట్లాడుతూ.. ఉద్యోగ లోకం అణిచివేతకు గురవుతున్న తరుణంలో రాష్ట్రంలోని గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు జేఎస్‌సీలో శాశ్వత సభ్యత్వం కల్పించడం హర్షణీయమన్నారు. కృషి చేసిన అఖిలభారత ఉద్యోగ సమైక్య జాతీయ ఉపాధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్, హుస్సేనీకి కృతజ్ఞతలు తెలిపారు.



## విపత్తు సమయాల్లో సమర్థవంతంగా సేవలందించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రకృతి విపత్తు సంభవించిన సమయంలో తక్షణసాయం అందించేలా ఆపదమిత్రలు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ ప్రేమ్ కుమార్ సూచించారు. మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐదుగురు ఆపదమిత్ర వలంటీర్లు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను కలిశారు. జిల్లాలో 300 మంది ఆపదమిత్ర వలంటీర్లు మొదటి విడత శిక్షణ పూర్తి చేసుకున్నారు. కాగా.. ఐదుగురిని మాస్టర్ ట్రెయినింగ్ కోసం ఎంపిక చేసి బెంగళూరులోని ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ అకాడమీలో 21 రోజులు మెరుగైన శిక్షణ అందించారు. జిల్లా నుంచి శిక్షణ పొందిన సురేఖ, జమున, రాజు, వెంకటేష్, సునీల్‌లను అదనపు కలెక్టర్ అభినందించారు. ట్రెయినింగ్ పూర్తి చేసుకున్న వలంటీర్లు మిగతా వలంటీర్లకు విపత్తు సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలా నివారించాలనే అంశాలపై మెళకువలు తెలపాలని సూచించారు.



## కేఎఫ్‌సీలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

**అక్షరటుడే, ఇందూరు:** రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని వేణుమాల్‌లో గల కేఎఫ్‌సీలో కుళ్లిన చికెన్ వచ్చిందంటూ ఓ కస్టమర్ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఫుడ్ సేఫ్టీ, నగర పాలక సంస్థ అధికారులు సంయుక్తంగా కేఎఫ్‌సీలో తనిఖీలు చేపట్టారు. కిచెన్‌లో దుర్వాసన రావడంతో నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. డ్రెయినేజీ మూసుకుపోవడం వల్ల దుర్వాసన వస్తుండడంతో నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. ల్యాబ్ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ సునీత తెలిపారు. కుళ్లిన చికెన్‌పై వివరణ ఇవ్వాలని నిర్వాహకులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.



## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 15న బీసీ డిక్లరేషన్ అమలు సంబరాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జరపనున్న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో పాటు ప్రముఖులు హాజరు కానున్నారు. ఇప్పటికే సభాస్థలిని కేబినెట్ మంత్రులు పరిశీలించారు. అయితే సీఎం రాక సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు, వీఐపీల రాకపోకల మార్గాలను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీఎం పర్యటన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ రాకపోకలు, భద్రతా చర్యలు కఠినంగా అమలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాల్లో సైన్ బోర్డులు, దిశ సూచికలు ఏర్పాటు చేయాలని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సైతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం.. ఎస్సైపై వేటు

**అక్షరటుడే, కామారెడ్డి:** విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై ఎస్పీ రాజేష్ చంద్ర కొరడా ఝులిపించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాజంపేట ఎస్సై దత్తాద్రి గౌడ్‌ను వేటు వేశారు. ఆయనను ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేయడంతో పాటు విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రల్లో డీజేలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. డీజేలు పెడితే సీజ్ చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. అయినా పలు ప్రాంతాల్లో డీజేలు ఏర్పాటు చేశారు. అలాగే రాజంపేటలో కూడా పలువురు యువకులు డీజేలు వినియోగించగా వాటిని నిరోధించడంలో ఎస్సై నిర్లక్ష్యం వహించినట్లుగా ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఈ క్రమంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా ఎస్సై దత్తాద్రి గౌడ్‌ను ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ రాజేష్ చంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న రాజును రాజంపేట ఎస్సైగా నియమించారు.

### ఇద్దరు హోంగార్డులు సైతం..

దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు మొగులయ్యను ఎస్పీ సస్పెండ్ చేశారు. గతనెల 25 నుండి ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరుగా ఉంటూ రాజకీయ కార్యకలాపాల్లో స్వయంగా పాల్గొంటున్నారని అందిన నివేదిక ఆధారంగా మొగులయ్యను సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కామారెడ్డి గణేశ్ నిమజ్జన సమయంలో హోంగార్డు సత్యనారాయణ బందోబస్తు డ్యూటీకి నియమించారు. అయితే ఆయన విధులకు గైర్హాజరయ్యారని వచ్చిన నివేదిక ఆధారంగా సత్యనారాయణను విధుల నుంచి సస్పెండ్ చేయడం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. విధులకు గైర్హాజరైనా.. శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే దిశగా ప్రతిఒక్కరూ విధులు నిర్వహించాలని పోలీసులకు సూచించారు.




## తెయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తాం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామని వైస్‌ఛాన్స్‌లర్ యాదగిరి రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు అనేది ఎన్నో ఏళ్ల కల అని అన్నారు. ఈ ప్రాంతంలోని విద్యార్థులకు ఉచితంగా ఇంజినీరింగ్ విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం తెయూలో కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడ సాంకేతికపరమైన బోధనా పద్ధతులతో నాణ్యమైన విద్యను అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, అందుకు కృషి చేసిన పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, భూపతి రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డిలకు ఈ సందర్భంగా వేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నందిని, అతిక్ సుల్తాన్ గోరి, భ్రమరాంబిక, నీలిమ, ఇంజినీరింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## బస్సుల కోసం విద్యార్థుల ఆందోళన

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** పాఠశాల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పీడీఎస్‌యూ, టీయూసీఐ ఆధ్వర్యంలో ఘన్‌పూర్-డిచ్‌పల్లి రోడ్డుపై విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ.. డిచ్‌పల్లి మండలంలో ఘన్‌పూర్, ఇస్లాంపూర్ నుంచి 60 మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్నారన్నారు. అయితే ప్రస్తుతం నడుస్తున్న ఆర్టీసీ బస్సు డిచ్‌పల్లి మీదుగా అన్ని గ్రామాలు తిరిగి ఘన్‌పూర్‌కు వచ్చేసరికి సుమారు గంట ఆలస్యం అవుతోందన్నారు. దీంతో విద్యార్థులు నిత్యం తరగతులకు లేటుగా వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘన్‌పూర్, ఇస్లాంపూర్ మీదుగా మోడల్ స్కూల్ వరకు ప్రత్యేకంగా ఒక బస్సు నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కార్తీక్, బబ్లు, కీర్తన, అవంతిక, ఆదిశ్రీ, తేజు, మురళీధర్, నవతేజ, నాయకులు రాములు, అశోక్, ప్రవీణ్, రమేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు తోడుగా నిలవడం అభినందనీయం

**అక్షరటుడే, ఇందూరు:** స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తూ విద్యార్థులకు తోడుగా నిలవడం అభినందనీయమని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల హిస్టరీ అధ్యాపకులు, జిల్లా అకడమిక్ మానిటరింగ్ సెల్ అధికారి నర్సయ్య సొంత డబ్బులతో హెచ్‌ఈసీ స్టడీ మెటీరియల్, నోట్ బుక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు ఉచిత మెటీరియల్‌ను వినియోగించుకొని ఉత్తమంగా రాణించాలని సూచించారు. అనంతరం మెటీరియల్ అందజేసిన నర్సయ్యను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.





## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణానికి సీఎం రాకముందే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ డిమాండ్ చేశారు. బీవీఎం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన రూ.9వేల కోట్లపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద రావాల్సిన డబ్బులు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎన్నోసార్లు మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇచ్చినా విడుదల చేస్తామని మాట ఇచ్చి తప్పారన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీవీఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, అర్బస్ ఖాన్, జిల్లా ఇన్‌ఛార్జి బుల్లెట్ చక్రవర్తి, నాయకులు రవి, చిట్యాల లింగం, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును తిలకించేందుకు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలి వస్తుంటారు. కానీ ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టు వద్ద పోచంపాడ్ గ్రామం ఉంది. స్థానికులు సైతం అనేక అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో గ్రామానికి వెళ్లే సమయంలో చీకట్లో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా అధికారులు మాత్రం స్పందించడం లేదు.

– అక్షరటుడే, మెండోరా





# 'సెంట్రల్' వెలుగులెప్పుడో..!

▸ అంధకారంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రోడ్డు ▸ పట్టించుకోని అధికారులు ▸ ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పోచం పాడ్ మార్గంలో వీధి దీపాలు లేక ఇటీవల ఓ యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. తెల్లవారు జామున గ్రామానికి చెందిన అఖిల్ అనే యువకుడు ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వీధి దీపాలు లేకపోవడం, ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం జరిగింది. గతంలోనూ పలువురు వాహనదారులు, పర్యాటకులు ప్రమాదాలబారిన పడ్డారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి పోచంపాడ్ నుంచి ఎస్సారెస్పీ మార్గంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు భద్రత సూచికలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



### అర్ధాంతరంగా నిలిచిన పనులు..

2014లో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టు నుంచి పోచంపాడ్ ఎక్స్ రోడ్-44 హైవే వరకు సుమారు 3.2 కి.మీ. పొడవైన రోడ్డు వేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కొన్నేళ్లు బాగానే ఉన్నా.. తరువాత వాటి నిర్వహణ కరువై వెలగడం లేదు. 2023లో సెంట్రల్ లైటింగ్ బాధ్యతలు ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించగా, వారు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. అయితే, గుత్తేదారు అనారోగ్యంతో మృతి చెందడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

### ముందుకొస్తున్న యువత..

వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక గ్రామానికి చెందిన యువకుడు దేగా దేవేందర్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువకులు స్పందించారు. పరశురాం, బిట్టు, నితీష్, అయాన్, ఋత్విక్, దేవేందర్ అనే యువకులు తమ సొంత ఖర్చుతో ప్రాజెక్టు నుంచి గ్రామంలోని రోడ్డు వరకు పక్కన ఉన్న చెట్లు, వీధి దీపాలు, యూటర్న్‌ల వద్ద అన్నింటికి రేడియంతో స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలు కొద్ది మేరయినా తగ్గుతాయంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్


నగరంలోని వినాయకనగర్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో..


ఎల్లారెడ్డి పట్టణంలో..

## చాకలి ఐలమ్మ సేవలు మరువలేం..

ఉమ్మడిజిల్లాలో చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయకమైన పోరాటం చేశారని గుర్తు చేశారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్


గాంధారిలో..


బోధన్‌లో..


పోతంగల్‌లో..


కోటగిరిలో..


శెట్పల్లి సంగారెడ్డిలో..


బోర్గాం(పి)లో..




## వరద బాధితులకు లయన్స్ క్లబ్ సాయం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన వరద బాధితులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. ఎల్లారెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో సుమారు 400 మందికి అందజేసినట్లు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆపద సమయంలో తోటివారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి వరద బాధితులకు చేయూతనివ్వాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతల చిత్రపటాలకు పాలాభిషేకం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లడిలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శి దేగ పోశెట్టి మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.30లక్షలు, 60 ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్ల నిర్మాణం, మైనార్టీ భవన నిర్మాణానికి, బస్సు షెల్టర్ కోసం నిధులు మంజూరు చేయించిన వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీలగిరి శ్రీనివాస్, సిరికొండ మహేష్, బండారి రమేష్, కృష్ణ, యోహాన్ రవి, గంగారాం, గంగాధర్, బాలరాజ్, శ్రీను, శివ, అరవింద్ పాల్గొన్నారు.

## 12న కేర్ డిగ్రీ కళాశాలలో రిక్రూట్ మెంట్ డ్రైవ్

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న రిక్రూట్ మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇమార్టికస్ సహకారంతో హెచ్‌డీఎఫ్‌సీ, సిటీ యూనియన్, యాక్సిస్, ఎస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేసేందుకు అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.20వేలకు పైన జీతభత్యాలు ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. 12న ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూ ఉం టుందని, ఏదైనా డిగ్రీ/ బీటెక్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత, 26 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వివరాలకు 9321825562 ను సంప్రదించాలని కోరారు.



## గాయత్రి నగర్‌లో స్వచ్ఛభారత్

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని గాయత్రి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ నిజామాబాద్ ఏరియా ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిల్లలకు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆర్‌సీఎఫ్ ఆఫీస్ సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎఫ్ లిమిటెడ్ ఏరియా ఇన్‌ఛార్జి సందీప్ కే శార్కర్, కంపెనీ మార్కెటింగ్ ఆఫీసర్ సునీల్ కుమార్, సుమంత్ కుమార్, ఎస్ అశోక్ కుమార్, జి చంద్రశేఖర్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ సరిత పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలో దారుణం చోటుచేసుకుంది. నగరంలోని పంచాయతీ రాజ్ కాలనీలో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సూరజ్‌రావు (22) తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగినట్లుగా తెలుస్తోంది. సూరజ్ రావు తండ్రి పద్మారావు అటవీశాఖలో విధులు నిర్వర్తిస్తున్నారు. అటవీశాఖ అధికారి తనయుడు ఇలా ఆత్మహత్యకు పాల్పడడం చర్చకు దారితీసింది. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అటవీశాఖ అధికారి ఇంట్లో విషాదం చోటుచేసుకోవడంతో ఆ శాఖ సిబ్బంది, అధికారులు పద్మారావు ఇంటికి చేరుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

## బోర్గాం(పి) వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని బోర్గాం(పి) వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంతెన పక్కన వాగులో మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. అనంతరం నాల్గో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు ఉండొచ్చని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హాసాకొత్తూరులో రక్తదాన శిబిరం




**అక్షరటుడే, కమ్మర్ పల్లి:** మండలంలోని హాసాకొత్తూర్ గ్రామం లో బీజేపీ బాల్కొండ ఇన్‌ఛార్జి ఏలేటి మల్లికార్జున్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు డి దామోదర్, సతీష్, సంతలింగారెడ్డి, శేఖర్, నవీన్, నరేష్ దేవేందర్, దేవ దాస్, కట్ట రాజేష్, నారాయణ , మహిపాల్, విజేత యువజన కుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి నిత్యావసరాల అందజేత



**అక్షరటుడే, లింగంపేట :** ఇటీవల భారీ వర్షాలకు మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన కర్రోళ్ల రమేష్ ఇల్లు కూలిపోయింది. దీంతో తెలుగుదేశం పార్టీ లింగంపేట మండల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు భీమ్ రావు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి బియ్యం, కిరాణం, దుస్తులను అందజేసి చిరు సహాయం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ కింద ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్ శర్మ, జగ్య నాయక్, కృష్ణ, రాములు, తిరుమల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ కార్యదర్శిని బదిలీ చేయొద్దు

**అక్షరటుడే, బోధన్:** బోధన్ సహకార సంఘం కార్యదర్శి ఉమాకాంత్ బదిలీ ఉత్తర్వులు నిలిపేసి యథాస్థానంలో కొనసాగించాలని బోధన్ సహకార సంఘం మహాజన సభలో సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు బుధవారం ఛైర్మన్ ఉద్మీర్ లక్ష్మణ్ అధ్యక్షతన మహాజన సభ సహకార సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఉమాకాంత్ ప్రతిఒక్కరైతుకు అందుబాటులో ఉంటూ ఎనలేని సేవలు అందిస్తున్నారని.. ఆయన బదిలీని వ్యతిరేకిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్, బోధన్ వీడీసీ ఛైర్మన్ గంగాధర్ రావ్ పట్వారి, సహకార సంఘం ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వీరభద్రారావ్ తదితరులు పాల్గొన్నారు.

